తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ ఆదివారం 02 - 08 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 4

# రంగనాథ్‌ను తొలగించకుంటే..

# సీఎం రేవంత్‌రెడ్డి న్యాయవ్యవస్థను కించపర్చడమే

## మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి

## బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్

- ఢిల్లీకి కప్పం కట్టడం కోసమే హైడ్రాను తెచ్చిన రేవంత్‌రెడ్డి
- కూలిందన్న కాళేశ్వరం నుంచి నీళ్లెలా వస్తున్నాయి



**ప్రజావారధి/మోత్కూరు**

హైకోర్టు ఆదేశాలతో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించకుంటే సీఎం రేవంత్‌రెడ్డి న్యాయవ్యవస్థను కించపర్చడమేనని మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇళ్లను కూల్చడం కోసమే హైడ్రాను తెచ్చారని ఆరోపించారు. హైడ్రాతో ఇప్పటి వరకు ప్రభుత్వ ఆస్తులను కాపాడటం కంటే పెద్దోళ్ల ఇళ్లనే కాపాడుతున్నారని, పేదల ఇళ్లను కనీస మానవత్వం లేకుండా కూల్చివేస్తూ వారిని కట్టుబట్టలతో రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పెద్దోళ్లను కాపాడుతూ వారి నుంచి కోట్ల రూపాయలు వసూలు చేస్తూ ఢిల్లీకి కప్పం కడుతున్నారని, అందుకోసమే హైడ్రాను వాడుకుంటున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఏ శాఖపై పట్టు లేదని, దీంతో రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా తయారవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 60 ఏళ్ల ఆంధ్ర పాలన కంటే మూడేండ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆగమవుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణపై, రైతాంగంపై ఏమాత్రం సోయి లేదని, కరువులో కాళేశ్వరం నుంచి నీళ్లు ఇవ్వమంటే ప్రాజెక్ట్ కూలిపోతుందని అబద్ధాలు ప్రచారం చేశారని, ఇప్పుడు అదే కాళేశ్వరం నుంచి నీళ్లు ఎలా విడుదల చేశారని ప్రశ్నించారు. తెలంగాణ రైతాంగానికి కాళేశ్వరం వరప్రదాయిని అని, కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ గొప్పతనం తెలంగాణ రైతాంగానికి, ప్రజలందరికీ అర్థమైందన్నారు. కష్టకాలంలో తెలంగాణ రైతాంగాన్ని ఆదుకుంటుంది కాళేశ్వరం ప్రాజెక్టేనన్నారు. నిజాన్ని ఎంతకాలం దాయలేరని, కాంగ్రెస్ ప్రచారం చేసిన అబద్ధాలను, మోసాలను ప్రజలంతా గమనించారన్నారు. రానున్న కాలంలో కాంగ్రెస్‌కు తెలంగాణ రైతాంగం, ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు కొండా సోమల్లు వారి వెంట ఉన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
ఆదివారం
జనరల్ న్యూస్
02 - 08 - 2026


# ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పెంచాలి




**ప్రజావారధి/మోత్కూరు**

పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని దత్తప్పగూడెం సర్పంచ్ గుండు యాదగిరి అన్నారు. మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామంలో హరితహారంలో భాగంగా శనివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ప్రతి మొక్కను విధిగా నాటి పెంచాలని కోరారు. పచ్చదనంతోనే పర్యావరణ సమతుల్యం దెబ్బతినకుండా ఉంటుందని, వర్షాలు కూడా బాగా కురుస్తాయన్నారు. గ్రామాన్ని హరితవనంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి




**ప్రజావారధి/మోత్కూరు**

ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ఏవో వి.కీర్తి కోరారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఎల్‌నినో ప్రభావం-ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా తక్కువ నీటితో సాగయ్యే కంది, కూరగాయలు, పువ్వుల తోటలు లాంటి పంటలు వేసుకోవాలని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. నీటి లభ్యత ఉన్న పెద్ద రైతులు ఆయిల్ ఫాం సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై పీఆర్‌జీ-176 రకం కంది విత్తనాలు అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మొగుళ్ల అనురాధశ్రీనివాస్‌రెడ్డి, ఏఈవో ఆర్.సింహప్రసాద్, రైతులు సైదులు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
ఆదివారం


# స్నేహితుని జ్ఞాపకార్థం స్కూల్ బ్యాగులు అందజేత

ప్రజావారధి/మోత్కూరు

స్నేహితుని జ్ఞాపకార్థం తాము చదువుకున్న పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేయడం అభినందనీయమని మోత్కూరు సీఐ సి.వెంకటేశ్వర్లు అన్నారు. మోత్కూరు మండలం పాటిమట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం 2014-15 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థి రాపోలు శ్రీకాంత్ మూడవ వర్థంతి సందర్భంగా అతని జ్ఞాపకార్థం ఆ బ్యాచ్ స్నేహితులు 65 మందికి బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మిర్యాల దామోదర్ అధ్యక్షతన జరిగిన



కార్యక్రమంలో సర్పంచ్ బండ రమావిజయ్ రెడ్డి, ఉపసర్పంచ్ దండెబోయిన సత్తయ్య, విద్యా కమిటీ చైర్మన్ కురుమేటి అనిత, రిటైర్డు హెచ్ఎం ఆకవరం వల్లభాయి, ఉపాధ్యాయులు ధర్మారపు వెంకటయ్య, ఉప్పలయ్య, లింగమల్లు, వెంకటేశ్వర్లు, దర్శనం వెంకన్న, తిరుపతి, మల్లయ్య, యాదయ్య, స్నేహితులు ఉయ్యాల సతీష్, సాయికిరణ్, శివ, సందీప్, తాళ్లపెల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

ప్రజావారధి/మోత్కూరు

తల్లిపాలతోనే బిడ్డకు ఎంతో ఆరోగ్యమని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడి సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. మోత్కూరు మండలం పాటిమట్ల అంగన్‌వాడి కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెండేండ్ల వరకు తల్లిపాలే కొనసాగించినట్టయితే బిడ్డ ఎంతో ఆరోగ్యంగా పెరుగుతారని, ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారం ఇవ్వడం మొదలు పెట్టాలని సూచించారు. అంగన్‌వాడి సెంటర్ల ద్వారా అందుతున్న పౌష్టికాహారాన్ని గర్భిణిలు, తల్లులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడి కేంద్రానికి వస్తున్న చిన్నారులకు యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ ఎం.పుష్పలత, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, పాటిమట్ల స్కూల్ సైన్స్ టీచర్ మల్లయ్య, వివో సభ్యులు కురుమేటి అనిత, ఆశావర్కర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
02 - 08 - 2026

# పాటిమట్ల స్కూల్‌లో..

# ఇంగ్లీష్ టీచర్ లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



- సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు
- ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి
- అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేత

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం పాటిమట్ల ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే టీచర్‌ను నియమించాలని సీపీఎం మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో పాటిమట్ల పాఠశాలలో సమస్యలు తెలుసుకుని శనివారం అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్ లేకపోవడంతో ఆ సబ్జెక్టు బోధించే వారు లేక విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకనుగుణంగా విద్యార్థులందరికీ పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయని, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు, విద్యుత్, ఫర్నీచర్, గ్రంథాలయం లాంటి కనీస వసతులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభం ముందే సమస్యలన్నింటినీ పరిష్కరించి విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చదువుకునేలా వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కురిమేటి యాదయ్య, శ్రీశైలం, బండి రవి, మెతుకు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

